క్లుప్తంగా

పిండి దీపం ఊరేగింపు



పిండిదీపం తెస్తున్న గోవింద భక్తులు

నగరి : పట్టణంలోని గోవింద మాల భక్త బృందం 30వ సంవత్సరపు పిండి దీపం కార్యక్రమాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించింది. మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయం నుంచి పిండి దీపం వెలిగించి గోవింద నామస్మరణ చేస్తూ మంగళవాయిద్యాలతో కరియమాణిక్య స్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చారు. పట్టణ ప్రజలు పిండి దీపానికి మొక్కారు. ఆలయం చేరిన పిదప దీపం పెట్టిన పిండి కోసం భక్తులు పోటీలు పడ్డారు. నిర్వాహకులు అందజేసిన పిండిని గోవిందభక్తులు ప్రసాదంగా తీసుకెళ్లారు.

వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా సామర్థ్యాల పరంగా వెనుకబడిన పిల్లలపై ప్రధానోపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ క్రిష్ణ మహేష్‌రెడ్డి కోరారు. మంగళవారం శ్రీబొమ్మరాజుపురం ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓతోపాటు సర్పంచ్ అయ్యప్ప సందర్శించారు. ప్రశ్నలు సంధించి విద్యార్థుల సామర్థ్యాలు ఎలా ఉన్నాయో పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ, పిల్లలకు సులభంగా అర్థమయ్యేలా పాఠాలు బోధించాలని టీచర్లకు సూచించారు. అలాగే మధ్యాహ్న భోజనం విద్యార్థులకు ప్రమాణాల మేరకు చేసి పెట్టాలన్నారు. హెచ్ఎం వెంకటేశులు, టీచర్లు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో ఫీల్డ్ అసిస్టెంట్లు

నగరి: భవిష్యత్‌లో ఉపాధి హామీ పథకం కింద చేయనున్న పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆరు నెలల పాటు ఉపాధి హామీలో చేయదలచిన పనులను వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు వివరించారు. సూచనలు పాటించాలని తెలియజేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అమ్మ ఆయిల్‌ఫామ్ సీఈఓ రంగనాయక్

శ్రీరంగరాజపురం: ఆయిల్ ఫామ్ తోటల సాగు రైతులకు ఓ వరమని అమ్మ ఆయిల్ ఫామ్ సీఈఓ రంగనాయక్ అన్నారు. మండలంలోని నెలవాయి రైతు సేవా కేంద్రంలో రైతులకు సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. మండలంలో ఆయిల్‌ఫామ్‌పై ఆసక్తి కలిగిన రైతులకు మొక్కలను ఉచితంగా ఇస్తామన్నారు. ఆయిల్‌ఫామ్ తోటల సాగు విధానం, సస్యరక్షణ తదితర విషయాలను దృశ్య మాధ్యమం ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. గంగాధరనెల్లూరు ఉద్యానవన శాఖాధికారి లోకేష్, ఢిల్లీ, భరత్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


క్షయపై అవగాహన ముఖ్యం



ఆశా వర్కర్లతో మాట్లాడుతున్న డాక్టర్ దుర్గాదేవి

గంగాధర నెల్లూరు: క్షయ వ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని గంగాధర నెల్లూరు వైద్యాధికారి డాక్టర్ పీపీ దుర్గాదేవి అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లకు సమావేశం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ, గ్రామీణులకు ఆశా వర్కర్లు ఆరోగ్య సూత్రాలను వివరించాలన్నారు. సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్తాఫీసర్ పీ.శ్రీనివాసులు, సూపర్‌వైజర్ దీప, శైల, ధర్మేంద్ర, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎం లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అధికారంలోకి వస్తే మేం పదివేలిస్తాం- అని వలంటీర్లకు ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన చంద్రబాబు నాయుడు గద్దెనెక్కి ఏడునెలలైనా ఆ హామీ ఊసే ఎత్తలేదు. దీంతో వలంటీర్లు ఇచ్చిన మాటను చంద్రబాబు నిలబెట్టుకోవాలని రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేసినా కదలిక లేదు. అయినా పట్టువదలని విక్రమార్కుల్లా ఆందోళన బాట పట్టిన వలంటీర్లకు మంత్రి లోకేష్ షాక్ ఇచ్చారు. వలంటీర్ల వ్యవస్థ ఇక లేదని స్పష్టం చేయడంతో పాటు తన తండ్రి ఇచ్చిన హామీని నెరవేర్చే ప్రసక్తే లేదని చెప్పకనే చెప్పారు. అధికారం కోసం హామీలు ఇవ్వడం, ఆ తర్వాత వంచించడం టీడీపీ నైజమని మరోసారి తేటతెల్లమైంది. మంత్రి లోకేష్ ప్రకటనపై వలంటీర్ల లోకం కుతకుతమని ఉడికిపోతోంది.



ఏశాడ్రా దెబ్బ..!

పదివేలన్నారు.. పంగనామాలు పెట్టారు

- వలంటరీ వ్యవస్థ ఇక లేదని స్పష్టం చేసిన మంత్రి లోకేష్
- మండిపడుతున్న వలంటీర్లు
- ప్రభుత్వం తీరుపై ఆగ్రహం

విజయపురం: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన వలంటీర్ల వ్యవస్థ ప్రజలకు ఎంతగా సేవలు చేసిందో ప్రజలకు తెలియంది కాదు. ప్రజలు-ప్రభుత్వానికి నడుమ వారధిలా ఉంటూ అర్హుల ఇళ్ల ముంగిటకే ప్రభుత్వ పథకాల ఫలాలను చేర్చడంలో వలంటీర్లు కీలకపాత్ర పోషించారు. ప్రతి 50 ఇళ్లకో వలంటీర్‌ను అప్పట్లో ఏర్పాటు చేయడంతో సమస్యలపై ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన అగత్యం తప్పింది. ముఖ్యంగా కరోనా సమయంలో వలంటీర్లు చేసిన సేవల గురించి ఇతర రాష్ట్రాలు సైతం ప్రశంసించాయి.



కరోనా సమయంలో బాధితులకు పోషకాహారం ఇస్తున్న వలంటీర్లు (ఫైల్)

నాడు కించపరచి..ఆపై పొగిడి..

వలంటీర్ వ్యవస్థను మొదట్లో తెలుగుదేశం పార్టీ తూలనాడింది. సాక్షాత్తు చంద్రబాబునాయుడే వారి సేవలను కించపరుస్తూ దారుణంగా మాట్లాడారు కూడా. వారినో అసాంఘిక శక్తులుగా చిత్రీకరించే ప్రయత్నం సైతం చేశారు. దీనిపై వలంటీర్లు రాష్ట్రవ్యాప్తంగా నిరసన సైతం వ్యక్తం చేశారు. అయితే ఎన్నికల సమీపించే నాటికి ఆయనతో పాటు పవన్ కళ్యాణ్ సైతం నాలుక మడత తిప్పారు. వారిని పొగడటం మొదలెట్టారు. అంతే కాకుండా తాము అధికారంలోకి వస్తే వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, పైగా రూ.5వేలకు బదులు గౌరవ వేతనం రూ.10వేలు ఇస్తామని ప్రకటించారు. దీంతో వలంటీర్లు ఖుషీ అయిపోయారు. తీరా అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా వలంటీర్ల గురించి ప్రస్తావించకపోగా..ఆ వ్యవస్థపై మంత్రులు కొందరు అనుచిత వ్యాఖ్యలు చేస్తూండడంతో వలంటీర్లలో అనుమానాలు మొదలయ్యాయి. చివరకు ఆందోళనబాట పట్టినా చంద్రబాబులో కదలిక రాలేదు. వలంటీర్ల వ్యవస్థ వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని మంత్రి నారా లోకేష్ ప్రకటించి చివరకు వారి ఆశలపై పూర్తిగా నీళ్లు చల్లారు.

వీధిన పడిన వలంటీర్ల కుటుంబాలు

నగరి నియోజవర్గంలో సుమారు 560 మందికిపైగా వలంటీర్లు ఉన్నారు. గత ప్రభుత్వంలో వలంటీర్లకు రూ.5 వేల చొప్పున నెలకు రూ.28లక్షలు చెల్లించేవారు. గ్రామాలలో రూ.5 వేలతో కుటుంబమంతా కలిసి జీవనం సాగించేవారు. అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థపై తీసుకున్న నిర్ణయంతో కుటుంబాలు వీధిన పడ్డాయి.

చాలా ఆశతో ఉన్నాం



నేను డిగ్రీ వరకు చదివాను. ఐదేళ్లు వలంటీర్‌గా పని చేశాను. టీడీపీ అధికారంలోకి వస్తే రూ. 10వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. చాలా ఆశ పెట్టుకున్నాం. అధికారం వచ్చిన తరువాత మాట మార్చి షాక్ ఇచ్చారు. వలంటీర్ వ్యవస్థ కొనసాగించే వరకు పోరాటం చేస్తాం.

చందు, వేపగుంట, పుత్తూరు మండలం

ప్రాణానికి తెగించి పని చేసాం



నాకు పెళ్లై పిల్లలు కూడా ఉన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన పథకాలను అర్హుల ఇళ్లకు చేరవేశాం. కరోనా సమయంలో ప్రాణానికి తెగించి పని చేశాను. టీడీపీ అధికారంలోకి వచ్చినా వలంటరీ వ్యవస్థను కొనసాగిస్తూ, రూ. 10వేలు ఇస్తామని చంద్రబాబు, పవన్ హామీ ఇచ్చారు. ఇప్పుడు ఆ హామీకి మంగళం పాడినట్లేనా? వలంటీర్ల సమాధానం చెప్పాలి.

చిరంజీవి, ఆలపాకం, విజయపురం మండలం

అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి



టి.నరసింహులు

పుత్తూరు: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అభివృద్ధితో పాటు అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తిరుపతి జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు టి.నరసింహులు తెలిపారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఆయన కోశాధికారి మన్యం నరసింహులుతో కలిసి మీడియాతో మాట్లాడారు. తిరుపతి జిల్లా ఏర్పడిన తర్వాత తొలిసారిగా తిరుపతి జిల్లా ప్రభుత్వ డిగ్రీ అధ్యాపకుల అసోసియేషన్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. రెండేళ్ల కాలపరిమితితో ఈ కార్యవర్గం సమస్యల పరిష్కారానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు చెప్పారు. జిల్లా తొలి కార్యవర్గంలో పుత్తూరు కళాశాలకు చెందిన అధ్యాపకులు టి.నరసింహులు, డాక్టర్ ఎం.నరసింహులు ఇద్దరు ఎన్నిక కావడంపై కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అభినందించారు.

చెత్త సేకరణ కేంద్రం పరిశీలన



చెత్త సేకరణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నింద్ర: మండలంలోని శ్రీరామాపురం గ్రామ పంచాయతీలోని చెత్త సేకరణ కేంద్రాన్ని మంగళవారం ఎంపీడీఓ శివప్రసాద్ వర్మ, పంచాయతీ విస్తరణాధికారి లక్ష్మీపతి పరిశీలించారు. మండల స్థాయిలో స్మార్ట్ విలేజ్‌గా తయారు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని, ప్రతి పంచాయతీలో చెత్తసేకరణ కేంద్రాలను పరిశీలించి అభివృద్ధి చేస్తామన్నారు.

రెవెన్యూ సదస్సుల్లో 264 వినతులు



గంగాధరనెల్లూరు: మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్

గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరులో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార చంద్రశేఖర్ మాట్లాడారు. ఇప్పటివరకు మండలంలో నిర్వహించిన సదస్సుల్లో మొత్తం 264 వినతులు అందాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, వైస్ ఎంపీపీ హరిబాబు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం : రైతులు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించడానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు డీటీ రవీంద్రబాబు అన్నారు. మండలంలోని 49 కొత్తపల్లె పంచాయతీ కొత్తపల్లెలో సర్పంచ్ డిల్లయ్య అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. డీటీ మాట్లాడారు. పొలం సరిహద్దులు, మ్యుటేషన్..ఇతర భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి రైతులు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రైతుల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సరిత, మండల సర్వేయర్ సురేష్, ఆర్ఐ ప్రభాకర్, పంచాయతీ కార్యదర్శి కోదండరామిరెడ్డి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

క్షయ, కుష్టుపై ఆందోళన వద్దు



మాట్లాడుతున్న పీఓ శిరీష

పాలసముద్రం: క్షయ, కుష్టు వ్యాధులపై ఇక భయపడాల్సిన పనిలేదని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రామ్మోహన్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్యాధికారి మోహన్ కృష్ణ అధ్యక్షతన ఆరోగ్య సిబ్బందికి క్షయ, కుష్టు, ఇతర వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రామ్మోహన్‌తోపాటు పీఓ శిరీష మాట్లాడారు. గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు బీసీజీ టీకాలు ఏయే వయస్కులు, వ్యాధిగ్రస్తులకు వేయాలో తెలియజేశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులపై గ్రామీణులకు అవగాహన కల్పించి, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్లు సుశీల, మురళి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



కమ్మకండ్రిగ శ్మశాన వాటికలో పిచ్చి మొక్కలు తొలగిస్తున్న దృశ్యం

విజయపురం: మండలంలోని ఆలపాకం పంచాయతీలో పారిశుద్ధ్యం మెరుగు పరిచారు. మంగళవారం ఆలపాకం బస్టాండు నుంచి గ్రామం వరకు సుమారు కిలోమీటరు దూరం రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలను తొలగించారు. మురుగు కాలువల్లో పూడిక తొలగించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అలాగే కమ్మకండ్రిగ, ఒరురూ గ్రామానికి చెందిన శ్మశాన వాటికల్లో ముళ్లకంపలు, పిచ్చి మొక్కలను జేసీబీతో తొలగించారు. ఇళ్ల పరిసర ప్రాంతాల్లో చెత్త లేకుండా శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని సర్పంచ్ బాబు కోరారు.

గజదాడులకు శాశ్వత పరిష్కారం చూపరూ!



కుప్పంలో సీఎంకు వినతి పత్రం ఇస్తున్న ఉమాపతినాయుడు

బంగారుపాళెం: ఏనుగుల దాడుల నుంచి రైతులకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా రైతు సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఉపాపతినాయుడు, వెంకట్రామిరెడ్డి మంగళవారం సీఎం చంద్రబాబుకు వినతి పత్రాన్ని సమర్పించారు. కుప్పం పర్యటనకు విచ్చేసిన సీఎంను రైతు సంఘం నాయకులు కలసి జిల్లాలో ఏనుగుల దాడుల వల్ల జరుగుతున్న పంట నష్టం, వాటి దాడుల నుంచి రైతుల పంటలకు రక్షణ కల్పించాలని కోరినట్లు తెలిపారు. తమిళనాడు, కర్ణాటక నుంచి జిల్లాలోకి ఏనుగులు ప్రవేశించాయని, ప్రస్తుతం వాటి సంఖ్య 120 వరకు ఉన్నట్టు సీఎంకు నివేదించారు. ఏనుగులు గుంపులు గుంపులుగా విడిపోయి, జిల్లాలోని అటవీ సరిహద్దు ప్రాంతాలైన కుప్పం, రామకుప్పం, పలమనేరు, బంగారుపాళెం, పులిచెర్ల తదితర ప్రాంతాల్లో సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నట్లు చెప్పారు. ఏనుగుల కట్టడికి పటిష్టమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఘనంగా ఓం శక్తి జ్యోతి పూజ

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో సోమవారం రాత్రి ఓం శక్తి భక్తులు శక్తి జ్యోతి పూజను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. అంబలి పోసి పూజలు చేశారు. అనంతరం సోమవారం రాత్రి కర్పూరంతో జ్యోతిని వెలిగించి భక్తి ప్రపత్తులతో అమ్మవారిని కొలిచారు. ఓం శక్తి పరాశక్తి అంటూ మహిళా భక్తులు అమ్మవారికి ప్రసాదాలను నివేదించారు.



శక్తి జ్యోతి పూజ చేస్తున్న భక్తులు

బాలికల ఉజ్వల భవితకు కిశోర వికాసం

వడమాలపేట (విజయపురం): బాలికల ఉజ్వల భవిష్యత్తుకు కిశోర వికాసం కార్యక్రమం పునాది వేస్తుందని, ఆరోగ్యకరమైన, సాధికారిత దిశగా బాలికల ప్రస్థానం సాగించడానికి అందరూ చేయూతనివ్వాలని హెల్త్ ఎడ్యుకేషన్ సైకాలజిస్ట్ గుణశేఖర్ అన్నారు. మంగళవారం వడమాలపేట మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రోజారమణి, మణి ఆధ్వర్యంలో కిశోర వికాసం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గుణశేఖర్ మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల బాలికలు చదువుపై దృష్టి పెట్టేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. 18ఏళ్ల లోపు వివాహాలు చేస్తే పోలీస్ స్టేషన్‌లో గానీ, ఐసీడీఎస్ అధికారులకు గానీ సమాచారం ఇవ్వాలని కోరారు. బాలికల సమగ్రాభివృద్ధికి ప్రతి గ్రామంలో బాలికల సంఘాలను ఏర్పాటు చేసి, వారికి అవగాహన కల్పించాలని సూచించారు. తహసీల్దార్ జరీనా మాట్లాడుతూ బాలికకు ఆత్మరక్షణ నిమిత్తం శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం పాటు డిజిటల్ భద్రత, సైబర్‌క్రైమ్, సామాజిక మాధ్యమాల్లో జాగ్రత్తగా వుండేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పురుషోత్తం, ఏఈఓ పద్మావతి, ఏపీఎం మునికృష్ణారెడ్డి, ఈఓపీఆర్‌డీ దయాసాదర్, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎం, వీఓ లీటర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



కిశోర వికాసం కార్యక్రమంలో అధికారులు

హామీలు నెరవేర్చు బాబూ

- ఆశావర్కర్ల డిమాండ్

విజయపురం: ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత డిమాండ్‌చేశారు. మంగళవారం జాతీయ సమితి పిలుపు మేరకు ఆశా వర్కర్ల సమస్యలపై డాక్టర్ సోమశేఖర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆశాలకు వేతనాలు పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, ఆశాల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తామని ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హామీ ఇచ్చి గద్దెనెక్కిన అనంతరం వాటిని విస్మరించారని విమర్శించారు. రాజకీయ నాయకుల వేధింపుల వేధింపులకు స్వస్తి పలకాలని, మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని, తమ ఉద్యోగాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తమకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న కరోనా, లెప్రసీ, టీబీ అలవెన్సులు ఇవ్వాలని కోరారు. ఏఎన్‌ఎంగా పూర్తి చేసి ఆశాలుగా సేవలందిస్తున్న వారికి ఏఎన్‌ఎంగా ఉద్యోగోన్నతి కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు, పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లత, లక్ష్మి, షీబా, గీత, రేవతి, మంజుల పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: తమకు కనీస వేతనం చెల్లించాలని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గీత డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, మురళీమోహన్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో తమ డిమాండ్లపై వినతి పత్రం ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్ల ఉద్యోగ భద్రత కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను రూ. 26 వేలకు పెంచాలన్నారు. రిటైర్మెంట్ ప్రోత్సాహం రూ. 5 లక్షలు చెల్లించి ప్రతి నెలా రూ. 10 వేలు పింఛన్ ఇవ్వాలన్నారు.తమకు సంబంధం లేని రక్త, గల్ల పరీక్షలు, గల్ల సేకరణ పనులు చేయించకూడదన్నారు. తమ డిమాండ్లపై స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆశా వర్కర్లు ఝాన్సీ, దేవకి, వాసంతి, భారతి, గుణవతి పాల్గొన్నారు.



కార్వేటినగరం: ఆశా వర్కర్ల సమస్యలపై మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: ఎన్నికల ముందు ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. కత్తెరపల్లె పీహెచ్‌సీలో మంగళవారం వైద్యాధికారులు భువనేశ్వరికి యూనియన్ జిల్లా నాయకులు అరుణ నాగేశ్వరి ఆధ్వర్యంలో వినపత్రం ఇచ్చి తమ డిమాండ్లపై ఆశా వర్కర్లు మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గంగాధర నెల్లూరు నియోజకవర్గ నాయకులు గోవిందస్వామి, నాయకులు వీణ, మంజుల, దుర్గ, విజయ, లోకేశ్వరి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నగరిలో..

నగరి: ఆశా వర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చందామరై డిమాండ్ చేశారు. మంగళవారం ఆశాడే సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ రమేష్‌కు ఆశావర్కర్లతో కలిసి ఆమె వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఆశా కార్యకర్తల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు రూ.26 వేలకు పెంచాలని, అధికారులు ఆశాలకు కేటాయించిన పనులనే చేయించాలన్నారు. తమ డిమాండ్లను తెలియజేశారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు నాయకులు రూప, విజయలక్ష్మి, రాజేశ్వరి, ఇంద్ర, పుష్ప, రేణుక, సుబ్బలక్ష్మి, జయప్రద పాల్గొన్నారు.







డాక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశావర్కర్లు, వెదురుకుప్పంలో..., నగరి: వినతిపత్రం ఇస్తున్న ఆశా వర్కర్ల యూనియన్ నాయకులు

కృత్రిమ మేధస్సుతోనే భవిష్యత్తు



సెమినార్‌లో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న అయ్యప్పన్

చిత్తూరు కలెక్టరేట్ : కృత్రిమ మేధస్సుతోనే భవిష్యత్తు ఉంటుందని తమిళనాడు రాష్ట్రం వీఐటీ ప్రొఫెసర్ అయ్యప్పన్ అన్నారు. స్థానిక సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం కృత్రిమ మేధస్సు జాతీయ సదస్సు(సెమినార్) ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా అయ్యప్పన్ మాట్లాడారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) ప్రపంచ వ్యాప్తంగా వేగవంతంగా పురోగతి సాధిస్తోందన్నారు. విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అనేది ఒక ముఖ్యమైన అంశంగా మారిందన్నారు. దేశంలోని పలు పాఠశాలల్లో ఇప్పటికే ఏఐ అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నరేంద్ర మాట్లాడుతూ, ప్రస్తుత తరంలో ఏఐ అన్ని రంగాల్లో దూసుకుపోతోందన్నారు. భవిష్యత్తులో ఏఐకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. కృత్రిమ మేధతో అనేక ఉపయోగాలు ఉంటాయని సదస్సు సంచాలకులు ప్రొఫెసర్ వినీల అన్నారు. విద్యార్థులకు ఏఐ ప్రాధాన్యతను తెలియజేసేందుకే జాతీయ సదస్సు నిర్వహించినట్లు చెప్పారు. అన్ని రంగాలపై ఏఐ ప్రభావం చూపుతోందన్నారు. విద్యార్థులకు కృత్రిమ మేధ విద్యలో ఉన్న అవకాశాలను డీఆర్‌డీఏ శాఖ జిల్లా మేనేజర్ సరితారెడ్డి తెలియజేశారు. ఎస్వీయూ కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కృత్రిమ మేధస్సు మానవ మేధస్సుకు ఎన్నడూ ప్రత్యామ్నాయం కాలేదని, అయితే భవిష్యత్తులో కృత్రిమ మేధస్సుకే అధిక అవకాశాలు ఉంటాయన్నారు. విజయం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గోపి మాట్లాడుతూ, మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు కొత్త కోర్సులు నేర్చుకోవాలన్నారు. అపోలో యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీరామన్ మాట్లాడుతూ 2015 నుంచి 2019 వరకు ఏఐ అప్లికేషన్లలో 270 శాతం వృద్ధి నమోదైనట్టు గార్ట్‌నర్ 2019 నివేదిక అంచనా వేసిందన్నారు. అనంతరం పరిశోధనా సంకలనాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సదస్సులో కళాశాల అధ్యాపకులు తిరుకుమరన్, ఉషారాణి, షమ్స్ అక్తర్ పాల్గొన్నారు.